kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

బుధవారం
18-03-2026 పేజీలు: 2

360° SINGLE TOPIC

SINGLE TOPIC

## గ్యాస్ షార్టేజ్




గ్యాస్ సిలిండర్ల కొరత ప్రభుత్వ స్కూళ్లనూ తాకింది. మధ్యాహ్న భోజనానికి రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో కట్టెల పొయ్యే దిక్కయింది. కొన్ని స్కూళ్లకు గ్యాస్ కనెక్షన్లు లేవు. ఇంకొన్ని చోట్ల ఉన్నా అవసరమైనన్ని సిలిండర్లు లేవు. రీఫిల్లింగ్ కోసం బుక్ చేసినా టైమ్‌కు రావడంలేదు. కొరత లేదన్నది ప్రభుత్వ వాదన. విద్యాసంస్థలకు ప్రయారిటీతో సప్లై చేస్తున్నామంటున్నారు మంత్రి ఉత్తమ్. వంటను వాయిదా వేయలేక కొన్ని చోట్ల డొమెస్టిక్ సిలిండర్లు వాడాల్సి వస్తున్నది. ఆల్టర్నేట్ లేని చోట్ల కట్టెల మీద వండక తప్పడంలేదు.

అర్బన్ స్కూళ్లలో ఎలా ఉంది.. పల్లెల్లో తిప్పలేంటి.. వర్కర్ల పరేషాన్ ఏ స్థాయిలో ఉంది.. ప్రభుత్వానికి వారి విన్నపాలేంటి ... స్టూడెంట్స్ పై పడిన ఇరాన్ వార్ ఎఫెక్ట్ మీద కలం 360 డిగ్రీస్ స్పెషల్..

తెలంగాణ బ్యూరో, కలం

ప్రభుత్వ స్కూళ్లకూ గ్యాస్ కొరత సెగ

చాలా చోట్ల కట్టెల పొయ్యి మీదనే వంటలు

స్పేర్ సిలిండర్లు లేక, బుక్ చేసినా తొందరగా రాక ఇబ్బందులు

# మిడ్ డే మీల్స్‌కు కట్టెల పొయ్యే!

## ఓరుగల్లులో సప్లై అంతంతే..

కలం, వరంగల్:

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లు 1,024. విద్యార్థులు 80, 457.
- వరంగల్, హనుమకొండ, కాజీపేట సిటీల పరిధిలోని పాఠశాలలకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం సప్లై చేస్తున్నారు.
- గ్యాస్ కొరతను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లోని మెజార్టీ స్కూళ్లలో కట్టెల పొయ్యి మీదనే వంట చేస్తున్నారు.



### రెండూ వాడుతున్నాం..



గవర్నమెంట్ స్కూళ్లకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వకుముందు కేవలం కట్టెల పొయ్యి మీదనే వంట చేసేవాళ్లం. ఇప్పుడు కనెక్షన్లు ఇవ్వడంతో రెండూ వాడుతున్నాం. గ్యాస్ కొరత ఉన్నప్పటికీ కట్టెలు అందుబాటులో ఉండడంతో ప్రస్తుతానికి ఇబ్బంది లేదు.

- ప్రమీల, అప్పర్ ప్రైమరీ స్కూల్, గణేశ్‌వాడ, జనగామ



## నల్గొండలో రీఫిల్లింగ్ కష్టాలు

కలం, నల్గొండ:

- ఉమ్మడి నల్గొండ జిల్లాలోని స్కూళ్లు 3,310. విద్యార్థులు 2.75 లక్షల మంది.
- మెజార్టీ పాఠశాలల్లో కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్నారు.
- గ్యాస్ కొరత, ధరలు పెరగడం, రీఫిల్లింగ్ ఇబ్బందుల దృష్ట్యా నిర్వాహకులు కట్టెల వినియోగానికే మొగ్గు చూపుతున్నారు.



### కట్టెలే వాడుతున్నాం..

మేం నల్గొండ జిల్లా కేంద్రం పద్మానగర్‌లోని మిర్యాల ఉన్నత పాఠశాలలో వంట చేస్తాం. 250 మంది విద్యార్థులకు వారానికి 3 సిలిండర్లు అవసరమవుతాయి. గ్యాస్ ధరలు విపరీతంగా ఉండడం, తరచూ రీఫిల్లింగ్‌కు వెళ్లాల్సి రావడంతో కట్టెలపైనే వండుతున్నాం. సంవత్సరానికి సరిపడా కట్టెలు ఒకేసారి కొంటున్నాం.

- రాపోలు యాదగిరి, పద్మానగర్, నల్గొండ



# ఖమ్మంలో కనెక్షన్లే లేవ్..

**కలం, ఖమ్మం:**

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాఠశాలలు సుమారు 2,600. విద్యార్థులు దాదాపు 1.5 లక్షల మంది.
- మెజార్టీ స్కూళ్లలో కట్టెల పొయ్యి మీదనే వంట చేస్తున్నారు.
- ఇటీవల గ్యాస్‌కు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతానికి పరిస్థితి కొంత మెరుగైంది.
- సిలిండర్లు ఎప్పటికప్పుడు రీఫిల్ చేయించుకొని స్పేర్‌లో ఉంచుకుంటున్నారు. స్పేర్ సిలిండర్లు తక్కువగా ఉండడంతో ఆచితూచి వాడుతున్నారు.

## ప్రభుత్వం కనెక్షన్లు ఇవ్వలేదు..



మేం 40 మంది విద్యార్థులకు వంట చేస్తాం. నెలకు మూడు సిలిండర్లు అవసరం. మేం ఇంట్లో వాడుకునే డొమెస్టిక్ సిలిండర్లే వినియోగిస్తున్నాం. ప్రభుత్వం వీలైనంత త్వరగా కనెక్షన్లు ఇప్పించాలి.

**- మునెమ్మ, కొత్తగూడెం**

## మెజార్టీ స్కూళ్లలో కట్టెలపైనే వంట..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,400 పాఠశాలల్లో 60 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతానికి మెజార్టీ స్కూళ్లలో కట్టెల పొయ్యి మీదనే వంట చేస్తున్నారు. 500 మందికి పైగా విద్యార్థులు ఉన్న కొన్ని స్కూళ్లలోనే గ్యాస్ వాడుతున్నారు. వాళ్లకు గ్యాస్ ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం.

**- నాగలక్ష్మి, డీఈవో, భద్రాద్రి కొత్తగూడెం**

## బండి కట్టెలు రూ. 3 వేలు



మేం మెనూలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతం ఉండడంతో కట్టెలకు కొరత లేదు. ఎప్పుడైనా గ్యాస్ అయిపోయినా ఇబ్బందుల్లేకుండా ఎప్పుడూ కట్టెలు సిద్ధంగా ఉంచుకుంటాం. బండి కట్టెలు రూ.3 వేలకు కొంటున్నాం. అవి వారం రోజులకు సరిపోతాయి.

**- చింతల విజయ, కొత్తగూడెం**





# నిజామాబాద్‌లో సిలిండర్‌కు 20 రోజులు

**కలం, నిజామాబాద్ :**

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని స్కూళ్లు 2,196. విద్యార్థులు దాదాపు 3 లక్షల మంది.
- గ్యాస్ కొరత వల్ల మెజార్టీ స్కూళ్లలో కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్నారు.
- బుక్ చేసిన 20 రోజుల తర్వాత గానీ సిలిండర్ రావట్లేదు.
- చాలా స్కూళ్లలో స్పేర్ సిలిండర్లు లేవు. కొన్ని చోట్ల మాత్రమే ఒకట్రెండు సిలిండర్లు స్పేర్‌లో ఉన్నాయి.



## 20 రోజుల దాకా రాకపోతే ఎట్ల?

గ్యాస్ సిలిండర్లు లేక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కట్టెల పొయ్యి మీదనే వంట చేస్తున్నారు. 20–25 రోజుల దాకా సిలిండర్లు రాకపోతే కార్మికులు వంట ఎలా చేస్తారు. స్కూళ్లలో గ్యాస్ సిలిండర్లు స్టాక్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**- స్రవంతి, జిల్లా అధ్యక్షురాలు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్**



## సిలిండర్లు సప్లై చేయాలి..

గ్యాస్ సిలిండర్ల కొరతతో టెన్షన్ పడాల్సిన పరిస్థితులు వచ్చాయి. సప్లై ఆలస్యమవుతుండడంతో రానున్న రోజుల్లో మరిన్ని కష్టాలు వస్తాయి. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలి.

**- ప్రమీల, మాక్లూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్, నిజామాబాద్**





# కరీంనగర్‌లో కొరతే..

**కలం, కరీంనగర్:**

- కరీంనగర్ జిల్లాలో 650కి పైగా స్కూళ్లు. 45 వేల మందికి పైగా విద్యార్థులు.
- పట్టణంలోని పాఠశాలల్లో పెద్దగా గ్యాస్ కొరత లేదు. 70 శాతం స్కూళ్లలో గ్యాస్ వినియోగిస్తున్నారు. మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నారు.
- పల్లెల్లోని పాఠశాలల్లో మాత్రం చాలా చోట్ల కట్టెల పొయ్యి మీదనే వండుతున్నారు.

## ఎప్పుడు అయిపోతుందో తెలియదు..

గతంలో గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. ప్రస్తుతం ఎప్పుడు అయిపోతుందో తెలియని టెన్షన్. ప్రధానోపాధ్యాయుడికి చెబితే ఆయన వెంటనే గ్యాస్ ఏజెన్సీతో మాట్లాడారు. ప్రభుత్వం సమయానికి సిలిండర్లు అందించి కొరత లేకుండా చూడాలి.

**- వినోద, కట్టారాంపూర్ స్కూల్, కరీంనగర్**

